నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 ఖమ్మం, శుక్రవారం 31 జనవరి 2025 KHAMMAM

- కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత పాలనపై ఉమ్మడి జిల్లాలో నిరసనలు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతులు
- చేతగాని హామీలు ఎందుకివ్వాలని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేతలు



మణుగూరు టౌన్ : బీఆర్ఎస్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి వినతి పత్రం సమర్పిస్తున్న రేగా కాంతారావు

# 420 హామీలు.. రోజులు


ఖమ్మం : గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న పగడాల నాగరాజు, ఆర్‌జేసీ కృష్ణ, పలువురు బీఆర్ఎస్ నాయకులు

ప్రజల ఓట్లను దక్కించుకునేందుకు ఎన్నో మాయమాటలు చెప్పారు. నోటికొచ్చిన 420 హామీలు గుప్పించారు. కానీ అధికారం చేజిక్కించుకుని 420 రోజులు దాటినా అతీగతీ లేదు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదు. రైతన్నలకు రైతుభరోసాపై ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామంటూ ఊరూరా సర్వేల పేరుతో ఊరించారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించలేదు. పింఛన్ల పెంపు ఊసెత్తడం లేదు. రేషన్‌కార్డుల జాడేలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులైనా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి నిరసన తెలిపారు. మణుగూరు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, దమ్మపేటలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. కొత్తగూడెంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, భద్రాచలంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు మానె రామకృష్ణ గాంధీ విగ్రహాలకు పూలమాల వేసి వినతిపత్రాలు అందజేశారు. ఖమ్మం నగరంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో ఆ పార్టీ నేతలు గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి నిరసన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కారని, ఆ తర్వాత కనీసం నాలుగు హామీలు కూడా నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతుభరోసా పథకాన్ని కేవలం ఒక్కో గ్రామానికే పరిమితం చేసి చేతులు దులుపుకున్నారని, ప్రజాపాలన, గ్రామసభల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు తీసుకొని వాటిని అర్హులకు కాకుండా అనర్హులకు ఇచ్చారని మండిపడ్డారు. గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని ముఖ్యమంత్రి, మంత్రులు పదే పదే వేదికలపై ప్రకటించినా.. ఆ పార్టీ అనుకూల వ్యక్తులకే వర్తించేలా జాబితాలు రూపొందించి గ్రామసభల్లో చదివి వినిపించారని, ఇది ఎంతవరకు సబబు అని వారు ప్రశ్నించారు. ఆయా పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింపజేయాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా వాటిని ఎప్పుడు ఇస్తారో చెప్పలేకపోతున్నారని, చేతగాని హామీలు ఎందుకు ఇవ్వాలని వారు ప్రశ్నించారు.

- ఖమ్మం, జనవరి 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / భద్రాద్రి కొత్తగూడెం (నమస్తే తెలంగాణ)


దమ్మపేట ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా, నాయకులు


ఇల్లెందు : గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, దిండిగాల


కొత్తగూడెం అర్బన్ : గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, జనవరి 30 : జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి బౌద్ధస్తూపం, పాలేరు చెరువు, ఖమ్మం ఖిల్లా, పులి గుండాల ప్రాజెక్టు, జమలాపురం, వెలుగుమట్ల అర్బన్ పార్కు వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికల గురించి, ఎకో టూరిజంపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి తలపెట్టిన పనులు, స్థితిగతులపై జిల్లా అటవీశాఖ అధికారి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక అభివృద్ధితోపాటు ప్రత్యేకంగా ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. వెలుగుమట్ల అర్బన్‌పార్కు వద్ద 40 ఫీట్ల రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ ఏరియా ఉండాలని, లోపల ఎటువంటి ప్లాస్టిక్ అనుమతించడానికి వీలులేదన్నారు. పార్కులో చిన్న పిల్లల ప్లే ఏరియా, బోటింగ్ ఏరియా అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. పార్కు లోపల రోడ్డు నిర్మాణం చేయాలని, పులిగొండలో క్యాంపు సైట్ క్రియేట్ చేసుకునే విధంగా పనులు పూర్తిచేసి ఎకో టూరిజం ట్రిప్ నిర్వహించాలన్నారు. పార్కుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఎకో టూరిజం బ్రాండింగ్ వచ్చేలా నూతన లోగో, ట్యాగ్‌లైన్ తయారు చేయాలన్నారు. జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అటవీపార్కు, కాటేజీ అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పాలేరు చెరువు వద్ద పిక్నిక్ స్పాట్ అభివృద్ధి చేయాలని, ఇక్కడ ప్రజలకు అధికంగా ఆదాయం వచ్చేలా జాతీయ రహదారి దగ్గర ప్రచార హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాలేర్ లేక్ వద్ద బోటింగ్, క్యాంటిన్, పిక్నిక్ స్పాట్, పిల్లలు ఆడుకునేందుకు ప్లే ఏరియా, బర్డ్ వాచింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పర్యాటక ప్రాంతంలో మరుగుదొడ్లు, పరిశుభ్రత పాటించాలని సూచించారు. సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మాణ పనులకు ప్రజలతో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. రోప్ వేకు 500 మీటర్ల దూరంలో పార్కింగ్ ఏరియా గుర్తించాలని ఆదేశించారు. ఖమ్మం ఖిల్లా వద్ద పురావస్తుశాఖ సమన్వయంతో అవసరమైన మరమ్మతులు చేపట్టి పర్యాటకులను ఆకర్షించాలని, స్కూల్ విద్యార్థులు, జర్నలిస్టులు, జిల్లా అధికారులతో ఖిల్లా చరిత్ర వాక్ ప్లాన్ చేసుకోవాలని తెలిపారు. జాఫర్ బావి వద్ద మార్చి నెలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థవిక్రమ్ సింగ్, డీఆర్‌డీవో సన్యాసయ్య, ఆర్డీవో నర్సింహారావు, పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, ఇరిగేషన్, దేవాదాయ, అటవీ, రెవెన్యూశాఖల అధికారులు పాల్గొన్నారు.


మిర్చి యార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

# ఎర్ర బంగారం.. భారీగా పతనం

- నాణ్యమైన మిర్చి క్వింటాల్ రూ.14 వేలు
- మార్కెట్‌లో కనిష్ఠ స్థాయికి చేరిన జెండాపాట
- వారంరోజుల వ్యవధిలో రూ.వెయ్యి తగ్గుదల
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 30 : బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు గంటగంటకూ జెట్ స్పీడ్‌తో పెరుగుతుంటే.. ఖమ్మం మార్కెట్‌లో మాత్రం ఎర్రబంగారం(తేజా మిర్చి) ధర రోజురోజుకూ పతనమవుతున్నది. పంట చేతికి వచ్చే సీజన్ కావడంతో గడిచిన వారంరోజుల నుంచి రికార్డు స్థాయిలో రైతులు మార్కెట్‌కు పంటను తీసుకొస్తున్నారు. జిల్లా రైతాంగంతోపాటు పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నుంచి సైతం రైతులు పంటను తెస్తున్నారు. గత ఏడాది మార్కెట్‌లో మిర్చికి రికార్డు స్థాయి ధర పలకడంతో రైతులు ఈ ఏడాది భారీగా సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చేసరికి జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావమో, ఖమ్మం ఏఎంసీ మార్కెట్ మాయాజాలమో తెలియదు కానీ పదిరోజుల నుంచి వరుసగా ధర తగ్గుకుంటూ వస్తున్నది. గత ఏడాది తాలు రకం పంటకు ఇదే మార్కెట్‌లో క్వింటాల్ రూ.14 వేల వరకు పలికింది. కానీ ఈ ఏడాది సీన్ రివర్స్ అయ్యి ప్రస్తుతం ఇదే మార్కెట్‌లో జెండాపాటలో నాణ్యమైన పంటకు గరిష్ఠ ధర క్వింటాల్ రూ.14 వేలకు చేరి రైతులను మరింత ఆందోళనకు గురిచేసింది. గురువారం ఉదయం జెండాపాట సమయానికి రైతులు రికార్డుస్థాయిలో 50 వేల బస్తాలను యార్డుకు తీసుకరావడంతో మిర్చియార్డు ఎర్రబంగారంతో కళకళలాడింది. కొద్దిసేపటికే జెండాపాట తరువాత ఎర్రబంగారం సాగు చేసిన రైతుల ముఖాలు వాడిపోయాయి. మిర్చిపంట అంటేనే పెట్టుబడులు అధికంగా ఉంటుంది. మిర్చినారుకు గాని, సొంతంగా మిర్చి సీడ్ తీసుకున్న రైతులకు ఇతర విత్తనాల కంటే అధిక ధర చెల్లిస్తుంటారు. ఇకపోతే రెండు, మూడు రోజులకు ఒకసారి పురుగు మందులు పిచికారీ చేస్తే కానీ పంట చేతికి వచ్చే అవకాశం ఉండదు. ఇలా కంట్లో ఒత్తులు పెట్టుకొని పంటను సాగు చేసిన రైతులు మార్కెట్‌లో పలుకుతున్న ధరను చూసి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

### ప్రత్యామ్నాయ చర్యలేవీ?

ఈ సంవత్సరం మిర్చి సాగు చేసిన రైతులకు పంట మంచి దిగుబడి వస్తున్నది. చీడపీడల బెడద, వైరస్ ప్రభావం పెద్దగా లేకపోవడంతో ఆరంభంలోనే మార్కెట్‌కు నిత్యం 40 నుంచి 50 వేల బస్తాలు తీసుకొస్తున్నారు. అయితే కనిష్ఠ స్థాయికి ధరలు పడిపోతుండడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. ఎగుమతిదారులు మిలాఖత్ కావడంతోనే ధరలు పడిపోతున్నాయని స్థానిక మిర్చి ఖరీదుదారులు పేర్కొంటున్నారు. అయితే ఇలాంటి ప్రత్యామ్నాయ పరిస్థితిలో మార్కెట్ పాలకవర్గం క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. మార్కెట్లో మిర్చి ధరలు పడిపోయిన ప్రతిసారి రైతుబంధు పథకం ద్వారా గత పాలకవర్గాలు రైతులకు వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నారు. ప్రస్తుత పరిస్థితిలో రైతులు పంటను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ పెట్టుకోవాలంటే మార్కెట్ ఆదాయ నిధుల నుంచి వడ్డీలేని రుణాలు ఇస్తామని హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ధర పెరిగిన తరువాత తిరిగి అమ్ముకునేందుకు వెసులుబాటు కలుగుతుంది. దీనికితోడు ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్, సీరోలు మండలాల పరిధిలో ఉన్న చైనా మిర్చి నుంచి నూనె తీసే చైనా కంపెనీలు పక్షంరోజుల ముందుగా ప్రారంభమయ్యే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకుంటే మార్కెట్లో పోటీతత్వం పెరిగి ధర పెరిగే అవకాశం ఉంటుందని మార్కెట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మిర్చి ధర మరింత పడిపోకముందే ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుందా? లేదా? అనేది వేచిచూడాలి.


### తాలుకంటే అధ్వానంగా అసలు ధర..



పోయిన ఏడాది తాలు పంటకు పలికిన ధర కూడా ఈ సంవత్సరం నాణ్యమైన పంటకు పలకడం లేదు. ఈ ఏడాది దాదాపు రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. పంట దిగుబడి సైతం తగ్గింది. కనీసం క్వింటాల్ రూ.20 వేలు పలికితేనే పెట్టుబడులు పూడే అవకాశం ఉంటుంది. కానీ మార్కెట్లో రోజురోజుకూ మిర్చి తగ్గుతుండడం చాలా బాధగా ఉంది. పేరుకు జెండాపాట కానీ ఆ ధర ఒక్కరిద్దరి రైతులకు మాత్రమే వ్యాపారులు పెడుతున్నారు. ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలి.

– పరిమి శ్రీనివాసరావు, రైతు, బాణాపురం, ముదిగొండ

### కౌలుకు తీసుకొని అప్పులపాలయ్యా..



భూమి కౌలుకు తీసుకొని మరీ మిర్చి పంట సాగు చేసి, ఇప్పుడు అప్పులపాలు అయ్యాను. ఒక్కో ఎకరానికి రూ.25 వేలు కౌలు, పెట్టుబడి రూ.50 వేలు అయ్యింది. దీంతో ఎకరానికి రూ.75 వేలు రావాలి. కానీ మార్కెట్‌లో అలాంటి పరిస్థితి లేదు. ఈ రోజు నేను మార్కెట్‌కు తీసుకొచ్చిన నెంబర్‌వన్ మిర్చి క్వింటాల్ రూ.13,500 మాత్రమే పలికింది. కానీ కాంటా వేసేటప్పుడు మరోసారి చూస్తాం.. తేడా వస్తే ధర తగ్గుతుందని చెబుతున్నారు. యార్డులో ఏ రైతుకూ కూడా పంట నాణ్యతను బట్టి వ్యాపారులు మంచి ధర పెట్టడం లేదు.

– రాపెల్లి కొండల్, రైతు, గువ్వలగూడెం, నేలకొండపల్లి

## విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ

- నిఘా వ్యవస్థలు మరింత పటిష్టం
- పోలీస్ కమిషనర్ సునీల్‌దత్


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జనవరి 30 : జిల్లాలో నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నిఘా వ్యవస్థలను మరింత పటిష్టపరచాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. గురువారం పోలీస్ కాన్ఫరెన్సు హాల్‌లో పోలీస్ అధికారులతో జరిగిన నేర సమీక్షా సమావేశంలో పోలీస్‌స్టేషన్ల వారీగా నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లో చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై సీపీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరగాలంటే కేసుల దర్యాప్తులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నేరం జరిగిన ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, నిందితుల అరెస్టు, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, కోర్టు ట్రయల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్లాలని సూచించారు. దొంగతనాల నియంత్రణ, చోరీ సొత్తు రికవరీ, పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, రాత్రి గస్తీ పెంచాలన్నారు. ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. దర్యాప్తు పూర్తిచేసిన కేసుల్లో చార్జిషీట్లు ఏ విధమైన ఆలస్యం లేకుండా ఫైల్‌చేసి కోర్టులో విచారణ ప్రారంభమయ్యే విధంగా ఏసీపీలు చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తుల వివరాలు తీసి సరిహద్దు పోలీస్‌స్టేషన్ల అధికారులతో పంచుకుంటూ కదలికపై నిఘా పెంచాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించి సైబర్‌నేరాలు, సీసీ కెమెరాల ఉపయోగం, మత్తు పదార్థాల వల్లన కలిగే అనర్థాలు వివరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలన్నారు. పెండింగ్ అట్రాసిటీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులు సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ట్రైనీ ఐపీఎస్ రుత్విక్‌సాయి, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రవి, శ్రీనివాసులు, సర్వర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## టీజీ ఐపాస్ దరఖాస్తులపై సత్వర నిర్ణయం

అదనపు కలెక్టర్ పి.శ్రీజ



మామిళ్లగూడెం, జనవరి 30 : జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు అనుమతుల కోసం వచ్చిన టీజీ ఐపాస్ దరఖాస్తులపై నిర్దేశిత సమయంలో సత్వర నిర్ణయం తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో పరిశ్రమల స్థాపన, టీజీ ఐపాస్, టీ–ప్రైడ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో టీజీ ఐ పాస్ విధానం అమలవుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు వచ్చిన 22 ప్రతిపాదనలలో 15 ప్రతిపాదనలకు వివిధశాఖల వారు జారీ చేసిన అనుమతులను, తిరస్కరించిన 3 ప్రతిపాదనలను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న 4 ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో టీప్రైడ్ పథకం కింద నూతనంగా ఏర్పాటు చేసిన 10 ఎస్సీ, ఎస్టీ యూనిట్లకు రూ.33,39,282 పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేశామన్నారు. సమావేశంలో పరిశ్రమల జీఎం సీతారాం, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదన్, నాబార్డు ఏజీఎం, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు పాల్గొన్నారు.